సాక్షి
ఆదిలాబాద్
గురువారం । 27 । ఏప్రిల్ । 2023

దనోరా(కే)లో చిరుత సంచారం



ఇంద్రవెల్లి మండలం దనోరా(కే) శివారులో చిరుత సంచారం కలకలం సృష్టించింది. బుధవారం ఉదయం స్థానిక రైతులకు కనిపించగా వారు ఆందోళనకు గురయ్యారు.

8లో▸

ఇద్దరికి కోవిడ్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో బుధవారం 76 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా ఇద్దరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఇందులో ఉట్నూర్ మండలం సాలెవాడకు చెందిన 46 ఏళ్ల మహిళ, ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడకు చెందిన 28 ఏళ్ల మహిళ ఉన్నారు. జిల్లాలో ప్రస్తుతం రెండు యాక్టివ్ కేసులు ఉండగా, ఒకరు రిమ్స్‌లో, ఒకరు హోమ్ ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
34.0/23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఈదురుగాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బాధ్యతలు స్వీకరించిన జడ్జిలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న న్యాయవాదులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ జిల్లా జడ్జిగా సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ జిల్లా జడ్జిగా పనిచేసిన ఎంఆర్ సునీత వనపర్తికి బదిలీ అయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ నుంచి వచ్చిన వరప్రసాద్ బాధ్యతలు చేపట్టారు. అలాగే ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జిగా సత్తుపల్లి నుంచి బదిలీపై వచ్చిన పి.శివరాం ప్రసాద్ కూడా బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన జడ్జిలను బార్ అసోసియేషన్ సభ్యులు, పీపీలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రాల నగేశ్, ఉపాధ్యక్షుడు చంద్రకాంత్ చౌదరి, సభ్యులు చందుసింగ్, సుధీర్, పీపీలు సంజయ్ వైరాగ్రే, మేకల మధుకర్, ఎం.రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యం

ఆదిలాబాద్‌రూరల్: అణగారిన వర్గాలకు రాజ్యాధికారమే లక్ష్యంగా డీఎస్పీ ఉద్యమిస్తుందని దళిత్‌శక్తి ప్రోగ్రాం రాష్ట్ర ఉపాధ్యక్షుడు అగ్గిమల్ల గణేశ్ మహరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా డీఎస్పీ అధినేత విశారదన్ మహరాజ్ స్వరాజ్య పాదయాత్రకు శ్రీకారం చుట్టారన్నారు. హైదరాబాద్‌లోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న ముగింపు సభలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ముందుగా సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు గంగన్న, పవన్, రవి, రాజేశ్వర్, సంతోష్, మహేష్, విఠల్, సంతోష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ‘ఓపెన్’ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. బుధవారం నిర్వహించిన పదో తరగతి పరీక్షకు 813 మందికి గాను 64 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఇంటర్‌లో 408 మందికి గాను 346 హాజరు కాగా, 62 మంది గైర్హాజరైనట్లు ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ అశోక్ తెలిపారు.

30 వరకు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: జీవో నంబర్ 58, 59 కింద స్థలాల క్రమబద్ధీకరణకు సంబంధించి ఈ నెల 30వరకు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రకటనలో తెలిపారు. మీసేవ కేంద్రాల ద్వారా సంబంధిత పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రహణమొర్రి శిబిరానికి స్పందన

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన గ్రహణమొర్రి శిబిరానికి స్పందన లభించింది. హైదరాబాద్‌కు చెందిన ఈవీఆర్ ఆస్పత్రి వైద్యుడు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పాల్గొని పలువురికి వైద్య పరీక్షలు అందించారు. ఉమ్మడి జిల్లాలోని ఆయా ప్రాంతాల నుంచి 25 మంది చిన్నారులను తల్లిదండ్రులు తీసుకొచ్చారు. ఇందులో తొమ్మిది మందికి పెదాల చీలిక, ఏడుగురికి పెదాలు, అంగిలి చీలిక, మరో ఏడుగురికి అంగిలి చీలిక, ఇద్దరికి బోన్ గ్రాఫ్టింగ్ ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. వీరికి ఈవీఆర్ ఆస్పత్రిలో ఉచితంగా చికిత్స అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్, డీఐవో వైసీ శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ జుబియా హాష్మి, డీఐసీ మేనేజర్ జైవింద్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



నిరుద్యోగ నిరసన ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి



రేవంత్ రెడ్డికి నాగలి బహూకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు, చిత్రంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తదితరులు

కాంగ్రెస్‌లో జోష్

- నిరుద్యోగ నిరసన ర్యాలీ సక్సెస్
- రేవంత్ రెడ్డికి జన నీరాజనం
- పాదయాత్రలో అభివాదం చేస్తూ ముందుకు
- కార్నర్ మీటింగ్‌కు తరలివచ్చిన శ్రేణులు

సాక్షి,ఆదిలాబాద్/ఆదిలాబాద్‌టౌన్/కైలాస్‌నగర్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాకేంద్రంలో నిర్వహించిన నిరుద్యోగ నిరసన సమరభేరి సక్సెస్‌తో ఆ పార్టీలో జోష్ కనిపిస్తోంది.ర్యాలీలో భాగంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన పాదయాత్రకు జనం నుంచి స్పందన కనిపించింది. వారికి అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. అంబేద్కర్ చౌక్‌లో నిర్వహించిన కార్నర్‌మీటింగ్ ప్రాంతం జనంతో కిక్కిరిసిపోయింది. సాయంత్రం6 గంటల సమయంలో రేవంత్ ఆదిలాబాద్ చేరుకున్నారు. మావల వద్ద ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఆ తర్వాత కలెక్టరేట్‌చౌక్ నుంచి పాదయాత్ర నిర్వహించారు.

ఆదిలాబాద్‌ను దత్తత తీసుకుంటాం..

కొత్త ఏడాదిలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాను దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తామని రేవంత్ రెడ్డి కార్నర్ మీటింగ్‌లో అన్నారు. ఆదిలాబాద్‌కు వస్తుంటే ఓ మిత్రుడు అక్కడ సభ ఎలా జరుగుతుందోనని అన్నాడని, ఇటీవల ఒక్కడు పార్టీని వీడడంతో ఆయన అలా అన్నారని చెప్పారు. అయితే పోయినోడు వెంట్రుకతో సమానమంటూ పరోక్షంగా ఇటీవల పార్టీని వీడిన మహేశ్వర్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు. వేలాది మంది కాంగ్రెస్ సైన్యం ముందు ఒక్కడు పార్టీని వీడడం లెక్క కాదని పేర్కొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో లక్ష 60వేల ఎకరాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆదిలాబాద్ అధైర్యపడొద్దని అన్నారు. ఇక్కడి ఎమ్మెల్యే జోకుడు రామన్న అంటూ జోగు రామన్నను విమర్శించారు. కేసీఆర్‌ను జోకడమే ఆయన చర్య అని విమర్శించారు. తనయుడికి మున్సిపల్ చైర్మన్ పదవి కట్టబెట్టడం ద్వారా కుటుంబ రాజకీయాలకు పెద్దపీట వేస్తున్నారని విమర్శించారు.

సుజాత వర్గం నారాజ్..

కార్నర్ మీటింగ్‌లో జిల్లాకు సంబంధించి జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్, మాజీ మంత్రి సి.రాంచంద్రారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత రేవంత్ రెడ్డి పక్కనే నిలుచున్నారు. అయితే ఆయన ప్రసంగిస్తూ సుజాత పేరును ప్రస్తావించకపోవడంతో ఆమె అభిమానులు ఈ విషయంలో అరవగా, రేవంత్‌రెడ్డి వారిని హెచ్చరించడం ప్రాధాన్యత సంతరించుకుంది. సుజాత వర్గం ఈ విషయంలో నారాజ్ అయింది. మరోపక్క అంబేద్కర్ చౌక్‌లో కార్నర్ మీటింగ్ నిర్వహించినప్పటికీ కనీసం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించకపోవడంపై కొంతమంది కార్యకర్తలు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్ రావ్ దూరంగా ఉన్నారు. ప్రధానంగా ఆయన వర్గంగా కొనసాగుతున్న వారిని రేవంత్‌రెడ్డి పట్టించుకోలేదనే వాదనలు పార్టీలో వినిపిస్తున్నాయి.

ఉద్యోగాల కోసం మలిదశ ఉద్యమం

నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఏర్పడ్డ తెలంగాణలో యువతకు ఉద్యోగాలు లేకుండా పోయాయి. బిస్వాల్ కమిటీ రాష్ట్రంలో 1.91లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నట్లు ప్రకటించింది. అందులో 1.11వేల ఉద్యోగాలు పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తామని, 80వేల ఉద్యోగాలు మాత్రమే ఖాళీగా ఉన్నట్లు చెప్పడం ప్రభుత్వ దుర్మార్గపు పాలనకు నిదర్శనం. టీఎస్‌పీఎస్ పేపర్ లీకేజీకి బాధ్యుడైన రాజశేఖర్‌రెడ్డి, ఆంధ్రా ప్రాంతానికి చెందిన ప్రవీణ్‌లు మంత్రి కేటీఆర్‌కు అత్యంత సన్నిహితులు. ఉద్యోగాల సాధన కోసం మలిదశ ఉద్యమాన్ని చేపట్టక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది.

– టి.జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీ

ఉద్యోగాలను అమ్ముకుంటోంది

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాలను సైతం ప్రభుత్వం అమ్ముకుని నిరుద్యోగులకు అన్యాయం చేస్తుంది. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేవరకు యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ వారికి అండగా నిలుస్తోంది. కల్వకుంట్ల కుటుంబానికి ఉద్యోగాలు వచ్చేయే తప్ప నిరుద్యోగులకు ప్రయోజనం చేకూరలేదు.

– బి.వెంకట్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు

లీకేజీలు, ప్యాకేజీల ప్రభుత్వం

పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాలను రెండు నెలల్లో భర్తీ చేసే దమ్ము ఈ ప్రభుత్వానికి ఉందా. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగాలను భర్తీచేస్తుంది. టీఆర్ఎస్‌ది లీకేజీలు, ప్యాకేజీల ప్రభుత్వం. యువత,నిరుద్యోగులంతా చేయి, చేయి కలిపి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలి.

– శివసేనరెడ్డి,యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు

మోదీ, షాలతో రాజ్యాంగానికి ప్రమాదం

ఆర్ఎస్ఎస్, బీజేపీ విధానాలతో రాజ్యాంగం ప్రమాదంలో పడింది. వాటికి వ్యతిరేకంగా నిలువాల్సిన సమయం ఆసన్నమైంది. బీజేపీని గద్దె దించే సత్తా కాంగ్రెస్‌కే ఉంది. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో పార్టీ అధికారంలోకి రావడం ఖాయం.

– నదీం జావీద్, ఏఐసీసీ సెక్రటరీ

నిరుద్యోగ భృతి ఇవ్వడంలో విఫలం

ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగులకు రూ.3,016 భృతి అందిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ వారిని మోసం చేశారు. నిరుద్యోగ యువతకు భరోసా కల్పించేందుకే ఈ నిరుద్యోగ మార్చ్ నిర్వహిస్తున్నాం. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తాం. నాలుగు శాతం రిజర్వేషన్లను తొలగిస్తామని కేంద్ర మంత్రి అమిత్‌షా అన్నారు. రిజర్వేషన్లు ఆయన తాత జాగీరు కాదు.

– షబ్బీర్ అలీ, మాజీ మంత్రి

కాంగ్రెస్‌కు అండగా నిలువాలి

అసమర్థ టీఆర్ఎస్ ప్రభుత్వం అవలంబిస్తున్నప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడమే లక్ష్యంగా రేవంత్‌రెడ్డి ముందుకు సాగుతున్నారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకిరావడం ఖాయం. నిరుద్యోగులు, యువతతో పాటు ప్రజలంతా కాంగ్రెస్‌కు అండగా ఉండి వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని అసెంబ్లీ స్థానాలన్నింటిలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలి.

– చిల్కూరి రాంచంద్రారెడ్డి, మాజీ మంత్రి

నేతల్లో ఉత్సాహం..

సమరభేరి సక్సెస్‌తో కాంగ్రెస్ నేతల్లో ఉత్సాహం కనిపిస్తుంది. డీసీసీ అధ్య క్షుడు సాజిద్‌ఖాన్ ఈ కార్యక్రమ నిర్వహణ కోసం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. కాగా మాజీ మంత్రి సి.రాంచంద్రారెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు గండ్రత్ సుజాత, వెడ్మ బొజ్జు, బోథ్ నియోజకవర్గ నేత ఆడె గజేందర్, ఖానాపూర్ నియోజకవర్గ నేతలు చారులత, భరత్ చౌహాన్ తదితరులు జనసమీకరణకు పాటుపడ్డారు. ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధి నుంచి జనాలను తరలించారు. టికెట్ ఆశావాహులు బలప్రదర్శనగా వచ్చారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, మాజీ మంత్రులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్ అలీ, మాజీ ఎంపీలు మల్లు రవి, సిరిసిల్ల రాజయ్య, మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి నదీం జావెద్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ పాల్గొన్నారు.

ప్రతీ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ రాహుల్‌రాజ్



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కైలాస్‌నగర్: ప్రతీ గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేలా కృషి చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేలా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతి, హరితహారం, ఉపాధి హామీ, మిషన్ భగీరథ పనుల నిర్వహణపై కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ముఖరా (కే) గ్రామాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఇతర జీపీలు ముందుకు సాగాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగించాలన్నారు. గ్రామాల్లోని నర్సరీల్లో లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలన్నారు. వేసవి దృష్ట్యా మొక్కలకు నిరంతరం నీరు అందించాలని, గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. వైకుంఠధామాల్లో నీటి సరఫరా, విద్యుత్, బయోఫెన్సింగ్‌ల పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. బహిరంగ మలవిసర్జన రహిత జిల్లాగా మార్చాలన్నారు. ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబ్‌కార్డు ఉన్న ప్రతీ కూలికి వంద రోజులు పని కల్పించాలన్నారు. అలాగే కూలీల సంఖ్య పెంచాలన్నారు. మిషన్ భగీరథ నీరు ఇంటింటికి సరఫరా అయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్ పాల్గొన్నారు.

ఆర్‌వోల వివరాలు పంపించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్

కైలాస్‌నగర్: జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల నియామకం కోసం నిర్దేశిత నమూనాలో మూడు రోజుల్లోగా వివరాలు పంపించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అ. దికారి వికాస్‌రాజ్ అన్నారు. హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో ఓటర్ జాబితాలో అనర్హుల తొలగింపు, ఎపిక్ కార్డుల జారీ వంటి అంశాలపై బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే జూన్‌లో ఈవీఎం, వీవీ ప్యాట్ల ఎఫ్ఎల్‌సీ నిర్వహించాలని, రాజకీయ పార్టీలకు ముందస్తు సమాచారం అందించి వీడియో రికార్డింగ్ చేయాలన్నారు. ఎఫ్ఎల్‌సీ నిర్వహణకు అవసరమైన సామగ్రిని తీసుకునేందుకు ప్రతి జిల్లా నుంచి నోడల్ అధికారిని నియమించాలని తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ప్రతి వారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించి, మినెట్స్‌ను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు కల్పిస్తూ సప్లిమెంటరీ ఓటరు జాబితా విడుదల చేయాలన్నారు. జిల్లాలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి ఓటరుగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్ ఎస్.నటరాజ్, ఆర్డీవో రాథోడ్ రమేశ్, పర్యవేక్షకురాలు నలంద ప్రియా పాల్గొన్నారు.

వడగళ్లు.. అన్నదాతకు కన్నీళ్లు



ఇక్కడ కనిపిస్తున్నది తలమడుగు మండలం కుచులాపూర్ గ్రామానికి చెందిన రైతు వామన్. తనకున్న ఏడెకరాల్లో ఐదెకరాలు జొన్న, రెండు ఎకరాల్లో నువ్వుల పంట సాగు చేశాడు. మంగళవారం కురిసిన వడగళ్ల వానకు పంటలు పూర్తిగా నేలకొరిగి నష్టపోయాడు. ప్రభుత్వం తనకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నాడు. ఇతనొక్కడే కాదు.. జిల్లాలో అకాల వర్షాలతో చాలా మంది రైతులది ఇదే పరిస్థితి.

- నిండా ముంచిన అకాల వర్షం
- జిల్లాలో రెండు వేల ఎకరాల్లో పంట నష్టం
- వ్యవసాయశాఖ ప్రాథమిక అంచనా
- ఆదుకోవాలని రైతుల వేడుకోలు



తలమడుగు మండలం భరంపూర్‌లో దెబ్బతిన్న జొన్నపంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య

కైలాస్‌నగర్: అకాల వర్షాలు అన్నదాతను నిలువునా ముంచుతున్నాయి. ఇప్పటికే వానాకాలంలో సాగు చేసిన పత్తి, సోయా పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతన్నకు ఈ యాసంగి కూడా కలిసిరావడం లేదు. మంగళవారం కురిసిన వడగళ్ల వాన కోలుకోకుండా చేసింది. ఏకధాటిగా కురిసిన భారీ వర్షానికి జొన్న, మొక్కజొన్న, వరి, నువ్వు, వేరుశనగ, వరి పంటలు నేలకొరగడంతో పాటు నీట మునిగాయి. ఈదురు గాలులకు మామిడి కాయాలన్నీ నేలరాలాయి. చేతికొచ్చిన పంటలు నీళ్లపాలు కావడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. బుధవారం క్షేత్రస్థాయిలో పంట చేలను పరిశీలించిన వ్యవసాయాధికారులు జిల్లాలోని తొమ్మిది మండలాల్లో రెండు వేల ఎకరాలకు పైగా పంట నష్టం జరిగినట్లుగా ప్రాథమికంగా అంచనా వేశారు. ఈ నష్టం మరింత పెరిగే అవకాశం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. బాధిత రైతులను ఆదుకోవాలని రైతు సంఘాలతో పాటు ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు.

2,143 ఎకరాల్లో పంట నష్టం

జిల్లా వ్యాప్తంగా 18 మండలాలు ఉండగా తొమ్మిది మండలాల్లో పంట నష్టం ఎక్కువగా జరిగినట్లుగా వ్యవసాయ అధికారులు గుర్తించారు. బుధవారం ఉదయం నుంచే ఆయా మండలాల వ్యవసాయాధికారులు తమ పరిధిలో నష్టపోయిన పంటచేలను పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి వివరాలు నమోదు చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 2,143 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లుగా ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో అత్యధికంగా జొన్న పంట 1956 ఎకరాల్లో దెబ్బతినగా, మొక్కజొన్న 60 ఎకరాల్లో, నువ్వులు 89 ఎకరాల్లో, వరి 32 ఎకరాల్లో వేరుశనగా 06 ఎకరాలు నష్టం జరిగినట్లుగా నిర్ధారించారు. అత్యధికంగా తలమడుగు, ఇచ్చోడ మండలాల్లోనే పంట నష్టం ఎక్కువగా జరిగినట్లుగా గుర్తించారు. కాగా ఉట్నూర్ మండలంలోని 38 ఎకరాల్లో మామిడి తోటలు దెబ్బతిన్నట్లుగా తేల్చారు. పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి నివేదించనున్నట్లుగా జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య తెలిపారు.

జిల్లాలో పంటనష్టం అంచనా వివరాలు

మండలం	జరిగిన పంట నష్టం (ఎకరాల్లో)
తలమడుగు	1239
తాంసి	135
నేరడిగొండ	115
మావల	128
నార్నూర్	190
భీంపూర్	83
సిరికొండ	85
ఉట్నూర్	103
ఇచ్చోడ	400

ప్రభుత్వమే ఆదుకోవాలి




ఈ యాసంగిలో మూడెకరాల్లో జొన్న సాగు చేసిన. పంట చేతికొచ్చే సమయానికి కురిసిన వడగండ్లతో చేతుల కష్టమంతా నేల పాలైంది. సుమారు రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టిన. ప్రభుత్వమే పరిహారం అందించి ఆదుకోవాలి.

– కత్తూరి గంగయ్య, గేర్జం గ్రామం, ఇచ్చోడ మండలం

రెగ్యులరైజ్ చేయాలని వినతి

- ఎమ్మెల్యేలను కలిసిన జేపీఎస్‌లు



ఎమ్మెల్యే బాపూరావుకు వినతిపత్రం అందజేస్తూ..


కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ప్రొబేషనరీ గడువు ముగిసినందున తమను వెంటనే రెగ్యులరైజ్ చేస్తూ జీవో జారీ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈమేరకు విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఆదిలాబాద్, బోథ్ ఎమ్మెల్యేలు జోగు రామన్న, రాథోడ్ బాపూరావు, జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్‌ను బుధవారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన ప్రతీ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ ఆదర్శగ్రామాలుగా తీర్చిదిద్దుతున్న పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. క్రమబద్ధీకరణతో పాటు ప్రొబేషనరీ కాలాన్ని సర్వీస్‌గా పరిగణించాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ కార్యదర్శులను జేపీఎస్‌లుగా పదోన్నతి కల్పించి వారిని కూడా రెగ్యులరైజ్ చేయాలన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించని పక్షంలో ఈ నెల 28నుంచి సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ప్రశాంత్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదుకోవాలని కలెక్టర్‌కు వినతి

తలమడుగు: వడగళ్లతో పంట నష్టపోయిన బాధిత రైతులను ఆదుకోవాలని జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి, ఎంపీపీ లక్ష్మి రాజేశ్వర్ కోరారు. ఈ మేరకు కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

మండలంలోని నందిగామ, కొత్త నందిగామ, బరంపూర్, పల్లి, లచ్చమ్‌పూర్, కుచులాపూర్, సకినపూర్, గ్రామాల్లోని వడగాళ్లతో నష్టపోయిన పంటలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పుల్లయ్య, జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి బుధవారం పరిశీ లించారు. రైతులను అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. వారి వెంట ఏడీ రమేశ్ తదితరులున్నారు.



కలెక్టర్‌కు వినతి అందజేస్తున్న జెడ్పీటీసీ గణేశ్‌రెడ్డి

నేరడిగొండ మండలంలో..

నేరడిగొండ: మండలంలో అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను కృషి విజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ప్రవీణ్, బోథ్ ఏడీఏ శ్రీధర్ స్వామి బుధవారం పరిశీలించారు. కుంటాల(కె) గ్రామంలో వడగళ్లతో పడిపోయిన జొన్న పంటను సందర్శించారు. పంట నష్టం నివేదికను ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. వారి వెంట ఏవో భాస్కర్, శాస్త్రవేత్తలు శివచరణ్, రఘువీర్, ఏఈఓ జైపాల్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

విద్యుత్‌షాక్‌తో ఆవు మృతి



మృతిచెందిన ఆవు వద్ద బాధితురాలు

నేరడిగొండ: మండలంలోని లింగట్ల గ్రామానికి చెందిన బీద్వాల్ కవితకు చెందిన ఆవు విద్యుత్‌షాక్‌తో మృతిచెందింది. దాని విలువ రూ.60 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరుతుంది.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

ఆదిలాబాద్‌టౌన్: ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ఘటన బుధవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. ఆదిలాబాద్ బస్టాండ్‌లో ప్రయాణికులను ఎక్కించుకొని బయటకు వస్తున్న ఉట్నూర్ డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సును తెలంగాణ చౌక్ నుంచి భోరజ్ వైపు వెళ్తున్న లారీ ఢీకొంది. ఆ సమయంలో బస్సులో 50 మంది ప్రయాణికులు ఉండగా ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరు ఊపిరిపీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన విషయాన్ని బస్ డ్రైవర్ మాన్‌సింగ్, కండక్టర్ రాజమణిలు ఆర్టీసీ అధికారులకు తెలియజేశారు. దీంతో అధికారులు సంఘటనా స్థలానికి చేరుకోగా లారీ డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు.

గొర్రెల కాపరిపై అడవి పంది దాడి

బోథ్: మండలంలోని కోట(కె) గ్రామానికి చెందిన గొర్రెల కాపరి రాజుపై అడవి పంది దాడి చేసిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారి లాగే గొర్రెలకు మేపడానికి అడవికి వెళ్లాడు. ఒక్కసారిగా అడవి పంది దాడి చేసింది. దీంతో చేయికి తీవ్ర గాయమైంది. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం బోథ్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

జువైనల్‌హోంకు బాలుడి తరలింపు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాగారంలో ఉన్న జువైనల్‌హోం నుంచి పరారైన నలుగురు బాలురలో ఒకరి ఆచూకీ లభించిందని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మహమ్మద్ ఒమర్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన బాలుడి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి జువైనల్‌హోంకు తరలించినట్లు చెప్పారు. శుక్రవారం రాత్రి నలుగురు బాలురు పరారైన విషయం తెలిసిందే. ఇంకా ముగ్గురు బాలుర ఆచూకీ లభించాల్సి ఉంది.

చెరువులో మృతదేహం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ధర్మసాగర్ చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కనిపించింది. పట్టణ సీఐ మల్లేష్ వివరాల ప్రకారం.. బుధవారం చెరువులో మృతదేహం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గజ ఈతగాళ్ల సాయంతో బయటకు తీయడానికి ప్రయత్నించారు. రాత్రి కావడంతో సాధ్యపడలేదు. గురువారం బయటకు తీయనున్నట్లు సీఐ తెలిపారు.

అన్నదాతకు ఊరట

- దిగివస్తున్న కాంప్లెక్స్ ఎరువుల ధరలు
- రైతులకు చేకూరనున్న ప్రయోజనం
- వచ్చే వానాకాలం నుంచి రంగుల బస్తాల్లో..



నేరడిగొండ: వానాకాలం పంటల సాగు నాటికి రైతులకు ఊరట లభించనుంది. పెట్టుబడి వ్యయం పెరుగుతున్న తరుణంలో ఎరువుల ధరలు దిగిరావడం అన్నదాతకు కొంతవరకైనా ఉపశమనమిచ్చే అంశమే. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి పదార్థాల ధరలు భారీగా తగ్గుతున్నాయి. దీంతో ఎరువుల కంపెనీల ధరలు తగ్గించేందుకు సమాయత్తమవుతున్నాయి. ఇప్పటికే కాంప్లెక్స్ 20–20–0–13 రకం ఎరువు ధర రూ.150 తగ్గింది. మరో నెలరోజుల్లో మరింతగా తగ్గి బస్తా రూ.వెయ్యి వరకు దిగివచ్చే అవకాశం ఉందని కంపెనీలు ఎరువుల డీలర్లకు సమాచారం ఇచ్చాయి.

భారీగా పెంచి..

గతేడాది కాంప్లెక్స్ ఎరువుల ధరలు భారీగా పెంచారు. 20–20–0–13 రకం బస్తా రూ.850 నుంచి రూ.1350కు చేరింది. 14–35–14, 28–28–0, 10–26–26 ఎరువుల ధరలు బస్తా రూ.1500 వరకు పెరిగాయి. పొటాష్ అత్యంత వేగంగా రూ.1700కు చేరింది. దీంతో రైతులు పొటాష్ వాడకం 70శాతం తగ్గించారు. ఫలితంగా డీలర్లు పొటాష్ తెప్పించడానికి జంకారు. అక్కడక్కడ ఎవరైనా ఓ లారీ లోడ్ తెప్పించినా నేటికీ అమ్ముడే పోలేదు. గతేడాది ఆరంభంలో డీఏపీ ధరలను కంపెనీలు రూ.1700 నుంచి రూ.1900కు పెంచాయి. కానీ కేంద్రం రాయితీ పెంచడంతో కంపెనీలు ధరలు తగ్గించి రూ.1350కి విక్రయించాయి. కాంప్లెక్స్, డీఏపీ ఎరువుల ధరలు ఒకేలా ఉండడంతో రైతులు ఎక్కువగా కాంప్లెక్స్ ఎరువులు వినియోగించారు.

ఇక రంగుల బస్తాల్లో ఎరువులు...

గతేడాది యూరియా కొత్త బస్తాలో భారత్ యూరియాగా వచ్చింది. వచ్చే వానాకాలం నుంచి పొటాష్‌కు, కాంప్లెక్స్‌కు, డీఏపీకి వేర్వేరు రంగుల్లో బస్తాలు రానున్నాయి. కంపెనీల మధ్య ధరల వ్యత్యాసం ఎక్కువగా ఉండడంతో రంగులను నిర్ణయించారు. రైతులు ఒకే బ్రాండ్ ఎరువు ఎక్కువగా వాడుతుండడంతో ఆ కంపెనీ ఎరువుకు డిమాండ్ పెరుగుతుంది. ఇతర కంపెనీలు ఇబ్బంది పడుతున్నాయి. దీన్ని గుర్తించిన కేంద్ర ప్రధాన మంత్రి భారతీయ జన ఊర్వరిక్ పరియోజన కింద ఒకే పేరుతో అంటే భారత్ డీఏపీ, భారత్ పొటాష్, భారత్ యూరియా, భారత్ ఎన్‌పీకే (కాంప్లెక్స్‌లు అన్నీ)లను కేటాయించిన రంగుల బస్తాల్లో సరఫరా చేయాల్సి ఉంది. వచ్చే వానాకాలం నుంచి కొత్త బస్తాల్లో ఎరువులు వస్తాయి. ఇప్పటికే మొదటి దఫా అక్కడక్కడా కొత్త బస్తాలు వచ్చాయి.

2022-23 వానాకాలం యాసంగిలో వినియోగించిన రసాయన ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో)...

ఎరువులు	వానాకాలం	యాసంగి
యూరియా	30,212	9,973
డీఏపీ	9,548	1,219
పొటాష్	1,146	201
కాంప్లెక్స్	26,185	2,159
సింగిల్‌సూపర్ ఫాస్ఫేట్	2,662	402

ధరల నిర్ణయం ఉత్పత్తిదారులదే...

గతంలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ధరల పెరుగుదల, రాయితీలు ఉండేవి. నాలుగేళ్ల క్రితం కంపెనీలకు ధరల నిర్ణయాధికారం ఇచ్చారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిపదార్థాల ధరల హెచ్చుతగ్గుదలను బట్టి ధరలు నిర్ణయిస్తున్నారు. కాంప్లెక్స్, డీఏపీ ఎరువుల తయారీకి అవసరమైన ఫాస్ఫరిక్ యాసిడ్, పొటాష్, ఫాస్ఫరస్ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటారు. ప్రస్తుతం వాటి ధరలు గణనీయంగా తగ్గాయి. దీంతో కాంప్లెక్స్ ఎరువుల ధరలు తగ్గుతున్నాయి. డిసెంబర్‌లో కాంప్లెక్స్ ఎరువు (20–20–0–13) రూ.1350 ఉండగా నెలకో రూ.50 చొప్పున తగ్గుతూ ప్రసుత్తం రూ.1200కు వచ్చింది. మరో నెల రోజుల్లో అన్నిరకాల కాంప్లెక్స్ ఎరువు బస్తాకు (50 కిలోల) రూ.200 నుంచి రూ.300 తగ్గే అవకాశం ఉన్నట్లు సమాచారం. 20–20–0–13 రకం ఎరువును రైతులు జిల్లాలో ఎక్కువగా వాడుతున్నారు.

రైతులకు ప్రయోజనం ఇలా..

రైతులు ఎకరానికి రెండు బస్తాల రసాయన ఎరువు వాడుతున్నారు. అంటే యాసంగిలో రూ.1350 ఉన్న ధర ప్రస్తుతం రూ.1200 ఉంది. అంటే ఒక ఎకరానికి రూ.300 తగ్గింది. వచ్చే వానాకాలం నాటికి రూ.1000 కానుంది. అంటే ఎకరానికి రూ.600 పెట్టుబడి తగ్గినట్లే.

బీజేపీ ఎంపీపై చర్య తీసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్: రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డ బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై చర్య తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి బీ సురేశ్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రెజ్లర్ల న్యాయ పోరాటానికి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని పేర్కొన్నారు. బ్రిజ్ భూషణ్‌పై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

'మద్యం, డబ్బులు పంచే సంస్కృతి బీజేపీకి లేదు'

నిర్మల్‌చైన్‌గేట్: మద్యం, డబ్బులు పంచే సంస్కృతి బీజేపీకి లేదని ఆ పార్టీ సీనియర్ నాయకుడు రావుల రాంనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తొలిసారిగా నిర్మల్‌కు వచ్చిన సందర్భంగా నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్న జనాన్ని చూసి ఓర్వలేకే మంత్రి ఐకేరెడ్డి ఇష్టారీతిన మాట్లాడుతున్నారని విమర్శించారు. యువత దేశభక్తి, జాతీయ భావంతో.. ప్రధాని మోదీపై అభిమానంతో స్వచ్ఛందంగా ర్యాలీలో పాల్గొన్నారని తెలిపారు. బీజేపీకి పెరుగుతున్న ఆదరణను చూసి మంత్రి తన ఓటమి తప్పదని భావించి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. మంగళవారం జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ ప్లీనరీలో మంత్రి ఓటమి తప్పదని భావించి మొసలి కన్నీళ్లు కార్చినట్లు చెప్పారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో నిర్వహించిన సర్వేలో మొట్టమొదట ఓడిపోయే సీటు నిర్మల్ అని తేలడంతో జీర్ణించుకోలేక పార్టీని బద్నాం చేస్తూ మళ్లీ అడ్డదారిలో గెలవాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రానిర్మల్ ప్రజలు మంత్రికి గుణపాఠం చెప్పి బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు.

ప్రజాప్రతినిధులూ.. రాజీనామా చేయండి

- ఫైర్‌స్టేషన్ ఏర్పాటు చేయకపోవడంపై యువకుల మండిపాటు
- రోడ్డుపై ధర్నా
- చట్టాన్ని ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదు : సీఐ కిరణ్ కుమార్
- ధర్నా చేసిన వారిపై కేసులు నమోదు చేసిన పోలీసులు



రోడ్డుపై ధర్నా నిర్వహిస్తున్న యువకులు

బోథ్: తెలంగాణ ఏర్పడిన తరువాత తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఆశిస్తే.. ఎలాంటి అభివృద్ధి చేయడం లేదని, ఫైర్ స్టేషన్ ఏర్పాటును ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని బోథ్ పట్టణ యువకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రానికి చెందిన సోహెల్ అనే యువకుని హోటల్ ప్రమాదవశాత్తు అగ్నికి కాలిపోయింది. నెల రోజుల వ్యవధిలో మూడు అగ్ని ప్రమాదాలు సంభవించడంతో పట్టణ యువకులు ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని బోథ్ ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. దాదాపు గంట పాటు రాకపోకలు నిలిచిపోయాయి. కిలో మీటరు మేర ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. ప్రజాప్రతినిధులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బోథ్ సీఐ కిరణ్ కుమార్, ఎస్సై రవిందర్‌లు ఘటనా స్థలానికి చేరుకుని యువకులతో మాట్లాడారు. తీవ్రతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. దీంతో యువకులు శాంతించారు.

ధర్నా చేసిన వారిపై కేసులు నమోదు..

ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని ధర్నా చేసిన యువకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ కిరణ్ కుమార్, ఎస్సై రవీందర్ తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే పనులు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. యువకులు బాధ్యతగా ఉండి తమ హక్కులు సాధించుకోవాలే తప్ప చట్టానికి అతీతంగా వెళ్లకూడదని తెలిపారు. మును ముందు ఇలాంటి చర్యలు చేపడితే చట్టపరమైన చర్యలకు వెనకాడబోమని అన్నారు.

ప్రమాదవశాత్తు హోటల్ దగ్ధం

బోథ్: మండల కేంద్రానికి చెందిన సోహెల్‌కు చెందిన హోటల్ ప్రమాదవశాత్తు దగ్ధమైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఉదయం 4.30 ప్రాంతంలో హోటల్‌లో మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. కాగా హోటల్‌లోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. దాదాపు రూ.2లక్షల ఆస్తినష్టం జరిగినట్లు బాధితుడు పేర్కొన్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కాగా విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ సురేందర్ యాదవ్ రూ.5వేలు. ఎంపీపీ తుల శ్రీనివాస్ రూ.10వేలు, సామాజిక కార్యకర్త ఇర్షాద్ అలీ రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బలరాం జాధవ్ బాధితుడిని పరామర్శించారు. బాధితుడికి తోడుగా ఉండాలని వారు పేర్కొన్నారు.



దగ్ధమవుతున్న హోటల్

అర్ధరాత్రి దొంగల హల్‌చల్

- బాసరలో తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు

భైంసాటౌన్: బాసర మండల కేంద్రంలోని నాలుగిళ్లల్లో మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. తాళాలు ఉన్న ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని దొంగతనానికి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి.. ఉప్పుకుంట కాలనీలో గోదావరి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. తాళం పగలగొట్టి లోనికి చొరబడిన దొంగలు బీరువాలోని రూ.5 వేల నగదు, రెండున్నర తులాల బంగారం ఎత్తుకెళ్లినట్లు బాధితురాలు పేర్కొంది. అలాగే దూదేకుల బాబుమియా ఇంట్లో సైతం చొరబడి రూ.4వేల నగదు, వెండి వస్తువులు దోచుకెళ్లారు. మైలాపూర్‌లోని ఎర్రం పాండురంగ ఇంట్లో రూ.40వేల నగదు, మూడు తులాల బంగారం చోరీకి గురైంది. పక్క ఇంట్లో ఉన్న నర్సుబాయిని గడ్డపారతో బెదిరించి నగదు, బంగారం ఇవ్వాలని బెదిరించడంతో భయపడిన ఆమె కేకలు వేయడంతో దుండగులు పారిపోయారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై మహేష్, సిబ్బంది చేరుకుని పరిశీలించారు. బుధవారం ముధోల్ సీఐ వినోద్ రెడ్డి, క్లూస్ టీం సిబ్బందితో కలిసి చోరీకి గురైన ఇళ్లను పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.



ఇంటిలో చిందరవందరగా పారేసిన వస్తువులు

బీజేపీలో పలువురి చేరిక

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ పట్టణం రాంనగర్‌కు చెందిన 50మంది యువకులు టీఆర్ఎస్ నుంచి బీజేపీ నాయకులు ఈద్గామ్ సాయి, మహరాజు రవి ఆధ్వర్యంలో బుధవారం బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కాషాయ కడువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నిర్మల్‌లో కాషాయ జెండా ఎగరడం ఖాయమన్నారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

బేల బంద్ సంపూర్ణం

- బంద్, ర్యాలీ, ధర్నాతో కదం తొక్కిన ఆదివాసీలు



జాతీయ రహదారిపై ఆదివాసీల ర్యాలీ

బేల: మండల కేంద్రంలో పలు సమస్యల పరిష్కారం డిమాండ్లతో బుధవారం ఆదివాసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ సంపూర్ణమైంది. మార్కెట్ కూడలి వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ చేశారు. దీంతో పాటు జాతీయ రహదారిపై ఆదివాసీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ముందస్తు అరెస్టు చేసిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల పరిషత్ అధ్యక్షుడు ఆడ శంకర్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతమైన బురాన్‌పూర్ శివారులో 1/70చట్టానికి సర్వే నంబరు 29/ఎ 13ఎకరాల్లో అక్రమంగా వేసిన లేఅవుట్, అక్రమ గుడిసెలు, ఇళ్లు, భవనాలను తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ శివారులో ఆదివాసీల ఆరాధ్య దైవమైన మర్సుకోల రాంజీగోండ్, కుమురం సూరు జెండాలను అక్రమంగా తొలగించి, ఆదివాసీ మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరించిన బేల పంచాయతీ కార్యదర్శిని వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. మశాల(కె) గ్రామ శివారులో జంగుబాయి దేవస్థానము భూ సమస్యను పరిష్కారించాలని, న్యాయపరమైన డిమాండ్లు పరిష్కారం చేయకపోతే, త్వరలోనే కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆదివాసీ సంఘాల నాయకులతో సీఐ కోల నరేష్‌కుమార్ మాట్లాడి సమస్యలను పైస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తామని సముదాయించారు. దీంతో ఆదివాసులు రాస్తారోకోను విరమించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు కొరంగే జంగ్‌షా, నైతం సీతరాం, సిడాం నందకుమార్, పెందూర్ రాందాస్, సలాం దేవ్‌రావు, పుసాం రాజేశ్వర్, కుషాల్‌రావు, ఫక్రు పటేల్, రేవంత్ పాల్గొన్నారు.

దీపాయిగూడ వాసికి ఉగాది పురస్కారం



రామగిరి సతీశ్‌స్వామి

జైనథ్: మండలంలోని దీపాయిగూడ గ్రామానికి చెందిన పురోహితుడు రామగిరి సతీశ్ స్వామి ఉగాది పురస్కారం అందుకున్నాడు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఉగాది పురస్కార మహోత్సవ కార్యక్రమంలో పురస్కారం అందుకున్నారు. సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పలువురికి పురస్కారాలు అందించారు. సతీశ్‌స్వామిని పలువురు అభినందనలు తెలిపారు.

'ఓపెన్' పరీక్షలకు 159 మంది గైర్హాజర్

నిర్మల్ రూరల్: జిల్లాలో బుధవారం జరిగిన ఓపెన్ స్కూల్ పదోతరగతి, ఇంటర్ పరీక్షలకు 159మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. పదోతరగతిలో 764 మందికి 683 మంది హాజరుకాగా 81మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు. ఇంటర్‌లో 485 మందికి 407 మంది హాజరు కాగా 78మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

దనోరా(కే)లో చిరుత సంచారం

ఇంద్రవెల్లి: మండలంలోని శంకర్‌గూడ పంచాయతీ పరిధిలో గల దనోరా(కే) శివారులో చిరుత సంచారం కలకలం సృష్టించింది. బుధవారం ఉదయం ఈ ప్రాంతంలో వ్యవసాయ పనులు చేస్తున్న రైతులకు చిరుత కనిపించగా వారు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. వెంటనే అటవీ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన ఎఫ్ఎస్‌వోలు విద్యానంద్, రాజేందర్, కృష్ణకాంత్ అక్కడికి చేరుకున్నారు. అడుగులను గుర్తించి చిరుత సంచరించినట్లుగా నిర్ధారించారు. మారుమూల గ్రామాల మీదుగా సిరిచెల్మ అటవీ ప్రాంతానికి వెళ్లినట్లుగా భావించారు. రైతులు అప్రమత్తంగా ఉండాలని, మరోసారి కనబడితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. చిరుత సంచారంతో అటవీసమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చిరుత అడుగులను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధించాలి

కైలాస్‌నగర్: స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకుని స్వయం సంవృద్ధి సాధించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. బుధవారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో హైదరాబాద్‌కు చెందిన ఆహార శుద్ధి పరిశ్రమల సొసైటీ ఆధ్వర్యంలో ఆహార శుద్ధి పరిశ్రమల మిషనరీ ప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిరుద్యోగ యువత, స్వయం సహాయక సంఘాలు, డ్వాక్రా మహిళలు, పారిశ్రామిక వేత్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. యూనిట్ల ఏర్పాటు, వాటి పనితీరును అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకుని ఉపాధి, ఆదాయ మార్గాలను పెంచుకోవాలన్నారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి, తయారీ సంస్థలు క్రమబద్ధీకరణ పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధిని సాధించాలన్నారు. వివిధ రకాల ఆహార ఉత్పత్తుల మిషనరీల ప్రదర్శనపై పూర్తిగా అవగాహన పెంచుకొని ఉపాధి పొందాలని అన్నారు. యువత పరిశ్రమల స్థాపనకు, వ్యాపార రంగంలో స్థిరపడేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలను ప్రవేశపెట్టి సబ్సిడీ అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ పద్మభూషణ్ రాజు, డీఎస్‌ఓ కిరణ్ కుమార్, ఎల్‌డీఎం భాస్కర్, బీసీ సంక్షేమాధికారి కె.రాజలింగు తదితరులు పాల్గొన్నారు.



యూనిట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

పిడుగుపాటు... చెట్టు దగ్ధం



పిడుగుపాటుతో దగ్ధమవుతున్న చెట్టు

నిర్మల్‌ఖిల్లా: జిల్లా కేంద్రం సమీపంలోని సోఫినగర్ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం కురిసిన ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి పిడుగు పడింది. జనావాసాలకు సమీపంలోని ఓ పెద్ద చెట్టుపై పిడుగు పడడంతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. ఎటువంటి ప్రమా దం సంభవించక పోవడంతో ఊపిరి పీల్చుకున్నా రు. చెట్టుపై పిడుగుపడిన దృశ్యాన్ని కొంతమంది తమ సెల్ ఫోన్లలో బంధించి సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంతో ప్రస్తుతం వైరల్‌గా మారింది.